ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో పలువురు విద్యార్థుల సత్తా

- చిరుమామిళ్లలో పది మందికి స్థానం
- పదో తరగతిలో వరుసగా ఏడుసార్లు నూరుశాతం ఫలితాలు


చిరుమామిళ్ళ శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నాదెండ్ల: పల్నాడు జిల్లాలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చిరుమామిళ్ళ శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో పది మంది ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు. పదో తరగతిలో 69 మంది విద్యార్థులకు గాను అందరూ ఉత్తీర్ణత సాధించారు. 2008లో పదో తరగతితో ప్రారంభమైన ఈ పాఠశాలలో ఇప్పటి వరకూ ఏడు సార్లు నూరు శాతం ఫలితాలు సాధించింది. ఈ ఏడాది 591 మార్కులతో పి.విజయలక్ష్మీ ప్రథమ స్థానంలో నిలవగా, 584 మార్కులతో షేక్ ఆసియా ద్వితీయ స్థానం, 583 మార్కులతో పి.అనూష తృతీయ స్థానంలో నిలిచారు. 55 మంది విద్యార్థులు 550కు పైగా మార్కులను సాధించారు.

2021-22లో ముగ్గురు, 2022-23లో ముగ్గురు, 2023-24లో ఇరువురు, 2024-25లో నలుగురు, 2025-26లో పది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు. ఇప్పటి వరకూ 22 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించటం పట్ల ఉపాధ్యాయులను గ్రామస్తులు అభినందించారు. ఇప్పటి వరకూ హెచ్ఎంగా పనిచేసిన సుందర రావు, ప్రస్తుత హెచ్ఎం కిషోర్‌ను పాఠశాల విద్యాదాత నడికట్టు రామిరెడ్డి అభినందించారు.

రొంపిచర్ల విద్యార్థులకు అభినందనలు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల ఏపీ మోడల్ స్కూల్ నుంచి ట్రిపుల్ ఐటీకీ ఎంపికైన విద్యార్థులకు మంగళవారం అభినంద సభ ఏర్పాటు చేశారు. ఎంపికైన రమావత్ మోతీబాయి, కోట వైష్ణవి, సకిలి జాహ్నవీలను శాలువాలతో సత్కరించి అభినందించారు. తమ పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీ కి ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవి నాయక్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని రానున్న కాలంలో ఎక్కువ మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ లో సీట్లు సాధించాలన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ఎస్ఎంసీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి 22 మంది ఎంపిక

నాదెండ్ల: మండలంలో ఐదు ఉన్నత పాఠశాలలకు ట్రిపుల్ ఐటీ సీట్లు దక్కాయి. 22 మంది విద్యార్థులు నూజివీడు, ఒంగోలు క్యాంపస్‌లకు ఎంపికయ్యారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు, సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు, చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన నలుగురు, గణపవరం జెడ్పీ హైస్కూలుకు చెందిన ఇరువురు, తూబాడు జెడ్పీ హైస్కూలుకు చెందిన ఒక విద్యార్థి సీట్లు సాధించారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జెడ్పీ హైస్కూలుకు చెందిన పిట్టల విజయలక్ష్మీ, షేక్ ఆసియా, వెనిగండ్ల అనూష, షేక్ ఫర్హానా, తొరటి అనిత, యామర్తి బిందు నూజివీడు ట్రిపుల్ ఐటీకి, దూసరి స్నేహలత, షేక్ అఫీఫా, జెల్లి స్మైలీ, షేక్ యాసీన్ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. సాతులూరు జెడ్పీ హైస్కూలుకు చెందిన షేక్ షహనాజ్, పత్తి పూర్ణ మనోహర్, గుంటి రజిని, సయ్యద్ సబీహా, కోటా కావేరిలు సీట్లు పొందారు. ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన వి తేజోకమల్ వర్షిత, జయశ్రీ నూజివీడు ట్రిపుల్ ఐటీకి, కె.నవ్య, ఎన్.ప్రవల్లిక ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. గణపవరం జెడ్పీ హైస్కూలుకు చెందిన సీహెచ్ సాత్విక నూజివీడు, ఎం.నాగసతీష్ కుమార్ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి, తూబాడు జెడ్పీ హైస్కూలుకు చెందిన పత్తిపాటి అమూల్య ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. సీట్లు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి అభినందించారు.

ఇరువురు ఉప్పలపాడు విద్యార్థులు...

నరసరావుపేట రూరల్: ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇరువురు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సుందరరావు తెలిపారు. పది పరీక్షల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు పోతిరెడ్డి శ్రీలక్ష్మీ 584 మార్కులు, తమ్మిశెట్టి వెంకట కల్యాణ్ 581 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చారని తెలిపారు. ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన ఇరువురు విద్యార్థులను మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు. ఇంటర్‌మీడియట్ రెండు సంవత్సరాలు, ఇంజినీరింగ్ నాలుగు సంవత్సరాలు ట్రిపుల్ ఐటీలో అభ్యసించే అవకాశం విద్యార్థులకు వచ్చిందని ప్రధానోపాధ్యాయుడు సుందరరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏఏ మధు కుమార్, ఎన్.నాగప్రసాద్, ఎన్.నాగేశ్వరరావు, కె.వి.సుబ్బారెడ్డి, ఎంఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రొంపిచర్ల నుంచి 11 మంది ఎంపిక

రొంపిచర్ల : మండలంలో గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 11మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ డి. బ్రహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో సంతగుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి సాధు సాహితి, గంటా ప్రేమ లక్ష్మీ మురారి, ముక్కంటి కీర్తన, ఎంపిక కాగా రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఆర్. భవ్యశ్రీ, ఏ.బి. సాయి లక్ష్మీ, కె. గోపాలకృష్ణమాచారి, గోగులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి యర్రగుంట్ల నీరజిత్ కుమార్, గుండ్రా పవన్, వి.రెడ్డిపాలెం ఎపి మోడల్ స్కూల్ నుండి రమావత్ మోతీబాయి, కోట వైష్ణవి, సకిలి జాహ్నవి విద్యార్థులు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. వీరందరూ నూజివీడు, ఒంగోలు, కడప, ఇడుపులపాయిలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఆయన తెలిపారు.


విరెడ్డిపాలెం విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నూజెండ్ల విద్యార్థికి సన్మానం


నూజెండ్ల విద్యార్థికి సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు

నూజెండ్ల: సాధించిన విజయంతో తృప్తి చెందకుండా ముందుకు వెళ్ళాలని డీఎల్‌డీపీ చైర్మన్ లగడపాటి వెంకట్రావు అన్నారు. నూజెండ్ల జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన అప్పిశెట్టి కాశీ వినోద్ సన్మాన కార్యక్రమం మంగళవారం జరిగింది. వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పదవ తరగతి ఫలితాలు తొలి మెట్టు వంటివన్నారు. మరిన్ని లక్ష్యాలు నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించి మండలానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి.శ్రీదేవి, సర్పంచ్ వీర్ల వెంకట స్వామి, లగడపాటి సూరి, బేతపూడి చిరంజీవి, గంగినేని బాబు పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థులు ఎంపిక

మండలం నుంచి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఎంఇవో రవిచంద్ర తెలిపారు. అప్పిశెట్టి కాశీ వినోద్, మండపాటి దేవిశ్రీ, టి.లక్ష్మీ లావణ్యలు ఎంపికైన వారిలో ఉన్నారు.

ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది



రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థల్లో పది మంది విద్యార్థులు చక్కటి ప్రతిభ చాటి సీట్లు సాధించటం పాఠశాలకే గర్వకారణం. ఉపాధ్యాయులు అంకితభావం, విద్యార్థుల చక్కటి క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించారు. నా స్వగ్రామమైన చిరుమామిళ్ళలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నా. విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలు, అదనపు యూనిఫాం, మధ్యాహ్న భోజనంలో అదనపు పౌష్టికాహారం, లైబ్రరీ పుస్తకాలు, ఆట వస్తువులను సమకూరుస్తున్నా. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ప్రయాణసౌకర్యం కల్పించి వారు చదువుకునేందుకు వాతావరణం కల్పిస్తున్నాం. ఆర్థికపరమైన కారణాలతో ఎవరూ చదువుకు దూరం కాకుండా చక్కగా చదువుకోవటమే తన లక్ష్యం.

– నడికట్టు రామిరెడ్డి, విద్యాదాత

క్లుప్తంగా

రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణ పనులు పరిశీలన



శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో గత ఏడాది 2023-24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి పథకం నిధులతో భూగర్భ జలాలు పెంపొందించటానికి రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణ పనులను కేంద్రం టీం సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా కేంద్ర టీం సభ్యులు బండి శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో భూగర్భ జాలాలు పెంపుదలకు ఇంకుడు గుంతలతో పాటు పాఠశాలల్లోని భవనాలపై నుంచి వర్షపు నీరు వృథాగా పోకుండా ఉండటానికి రూఫ్ వాటర్ ఆర్ వెస్టింగ్ గుంతలు ఎంతో దోహదపడతాయన్నారు. శావల్యాపురం మండలంలో 33 నిర్మాణ పనులు చేశామని, ఒక్కోక్కోటికి రూ.42 వేలు నిధులతో నిర్మాణ పనులు పారదర్శకంగా చేసినట్లు తెలిపారు. ఏపీడీ ఈవూరి బూసిరెడ్డి, ఏపీవో కె.రామారావు, టీఏ రోజారాణి, సుధాకర్ ఉన్నారు.

డాక్టర్ కోడెల స్టేడియంకు పూర్వవైభవం తెస్తాం



నరసరావుపేట: రాబోయే రోజుల్లో డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంకు పూర్వ వైభవం తీసుకు వస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. సత్తెనపల్లి రోడ్డులోని స్టేడియంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. చీపురు పట్టి చెత్తను శుభ్రం చేశారు. స్టేడియం ప్రాంగణంలోని గడ్డిని పిచ్చి మొక్కలను తొలగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గంలో ప్రతిరోజు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ-4లో అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని, ఎమ్మెల్యే అంటే ప్రజలకు సేవ చేయడమేనని, అధికారం అనుభవించడం కాదన్నా రు. మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయ కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు మహిళలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారులు న్యాయ స్థానం తీర్పుపట్ల హర్షం

చిలకలూరిపేట: మండలంలోని పసుమర్రు గ్రామానికి చెందిన పి.మరియమ్మ వినియోగదారుల న్యాయస్థానంలో విజయం సాధించడం పట్ల పల్నాడు జిల్లా వినియోగదారులు సంఘం అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. పసుమర్రు గ్రామానికి చెందిన మరియమ్మ అనే మహిళకు యూనియన్ బ్యాంక్‌లోని ఖాతాలో రూ.16,500 జమ చేసుకుంది. అయితే ఆమెకు తెలియకుండా ఆమె ఖాతాలోని సొమ్ము రూ.16,500 వేరొకరి ఖాతాకు బ్యాంక్ సిబ్బంది ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె బ్యాంక్ అధికారులను సంప్రదించగా, వారి నుంచి ఆమెకు సరైన సమాధానం లభించలేదు. దీంతో ఆమె బ్యాంకింగ్ అంబుడ్స్‌మెన్‌కు ఫిర్యాదు చేసింది. విచారణ జరిపిన బ్యాంకింగ్ అంబుడ్స్‌మెన్ ఆమె ఖాతాకు రూ.16,500 జమ చేయాలని ఆదేశించారు. ఇదే సమయంలో సదరు మహిళ వినియోగదారుల కోర్టులో సైతం ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కేసు పూర్వాపరాలు విచారించిన వినియోగదారులు న్యాయస్థానం బ్యాంక్ సిబ్బంది నిర్లక్ష్యాన్ని తప్పుపట్టింది. ఆమె చేసిన డిపాజిట్‌తో పాటు రూ.7 వేలు అపరాధ రుసుంగా చెల్లించాలని, అదేవిధంగా మరో రూ.2 వేలు కోర్టు ఖర్చుల కింద చెల్లించాలని ఆదేశించింది. బ్యాంకులో జరిగిన తప్పిదం పట్ల పోరాడిన మహిళ మరియమ్మను, న్యాయవాది గుదే రవితేజను వినియోగదారుని సంఘం అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.

గ్లైసిల్ బీటీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నరసరావుపేట రూరల్: అనధికార గ్లైసిల్ బీటీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. పట్టణంలోని విత్తన దుకాణాల్లో వ్యవసాయ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఏడీఏ మస్తానమ్మ, ఏవో శాంతి తనిఖీల్లో పాల్గొన్నారు. దుకాణాల్లోని నిల్వలను, స్టాక్ రిజిస్టర్ ఇన్వాయిస్, బిల్ పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మస్తానమ్మ మాట్లాడుతూ అనధికార బీటీ విత్తనాలను విక్రయిస్తే విత్తన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. విత్తనాలను ఎంఆర్‌పీలకు మించి విక్రయించకూడదన్నారు. రైతులకు లాట్ నెంబర్ రాసి బిల్లులు ఇవ్వాలని తెలిపారు. రైతులు పంట సీజన్ ముగిసే వరకు బిల్లులు, ఖాళీ సంచిని భద్రపర్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో అనధికార పత్తి విత్తనాలు విక్రయాలు జరుగుతున్నట్టయితే సంబంధిత వ్యవసాయ అధికారికి సమాచారం అందించాలని సూచించారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది

నాదెండ్ల: సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని హెచ్ఎం వి.వెంకటరావు చెప్పారు. సాతులూరు గుంటూరు వెంకటప్పయ్య ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న కల్లు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సుజాత, శైలజ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్ది వారి జీవితాలు విజయవంతంగా సాగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు హిదయతుల్లా, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, హనుమంతరావు, మాధవి, నాగేశ్వరరావు, ఎస్ఎంసి చైర్మన్ కోటేశ్వరమ్మ ఉన్నారు.

పంటల సాగులో విత్తనాల ఎంపిక ముఖ్యం

నాదెండ్ల: పంటల సాగులో విత్తనాల ఎంపిక ముఖ్యమని మండల వ్యవసాయాధికారి శ్రీలత చెప్పారు. జంగాలపల్లె, సంకురాత్రిపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సంకురాత్రిపాడులో జరిగిన కార్య క్రమంలో ఆమె మాట్లాడుతూ రైతులు లైసెన్సుడు దుకాణాల్లోనే కొనుగోలు చేసి తప్పనిసరిగా రశీదు పొందాలన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నకిలీ విత్తనాలు విక్రయిస్తారని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం 50 శాతం రాయితీపై జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు పొందవచ్చన్నారు. గతేడాది పొగాకు సాగు చేసిన రైతులు పంటను అమ్ముకునే విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏపీఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేయించుకున్న రైతులు మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు విక్రయించుకోవచ్చన్నారు. ముందుగా రైతులు గ్రేడ్‌ల వారీగా విభజన చేసుకుని పొగాకు తరలించాలన్నారు. మొదటి రకానికి రూ.12 వేలు, రెండో రకానికి రూ.6 వేలు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరావు, వీపీఏ అశోక్ రెడ్డి ఉన్నారు.

సీసీ ఆర్సీ కార్డులకు పేర్లు నమోదు చేసుకోండి

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల రెడ్డిపాలెం, చాలకకుంట తండా గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశాల్లో వ్యవసాయ అధికారి శివలలిత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కౌలు రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. సీసీ ఆర్సీ కార్డుల వల్ల కౌలు రైతులకు వనగూరే ప్రయోజనాలు వివరించారు.

రొంపిచర్ల బస్టాండ్ వరకు బస్సులు నడుపుతాం

- బస్టాండ్ శుభ్రంగా ఉంచుతాం
- బస్టాండ్ సందర్శించిన డీఎం, సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్



రొంపిచర్ల బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీఎం శ్రీనివాసరావు, సిబ్బంది

రొంపిచర్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఎటువంటి వాహనాల పార్కింగ్ ఇతరులు ఆక్రమణలు చేయకుండా చూడాలని ఆర్టీసీ అధికారులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐను కలిసి విన్నవించారు. ఆదివారం సాక్షి దినపత్రికలో బస్టాండేగా..ఆక్రమిస్తే పోలా అంటూ ప్రచురితమైన కథనానికి స్పందించిన డిపో మేనేజర్ బూదాటి శ్రీనివాసరావు బస్టాండ్ సందర్శించారు. ఆ సమయంలో అక్కడ కాంప్లెక్స్‌లో కొన్ని ఆటోలు, స్కూటర్లు నిలబెట్టి ఉండటాన్ని గమనించి వాటి యజమానులను పిలిచి అక్కడి నుంచి తీసివేయించారు.. తాము చేసిన విజ్ఞప్తికి పోలీసులు స్పందించి ఇకపై అక్కడ ఎటువంటి వాహనాలు పార్కింగ్ చేయకుండా చూస్తామని చెప్పినట్లు డీఎం తెలిపారు. అనంతరం బస్సులను అక్కడికి పంపించామన్నారు.

ఇకపై ఆ రూట్‌లో తిరిగే బస్సులన్నీ రొంపిచర్ల బస్ స్టేషన్ వరకు వెళ్లేటట్లుగా ఆదేశాలు ఇచ్చామన్నారు. బస్‌స్టేషన్‌ను ఇకపై శుభ్రంగా ఉంచటం జరుగుతుందని, రొంపిచర్ల ప్రాంత ప్రజలు బస్‌స్టేషన్ ఉపయోగిస్తూ ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం చేయాలని డీఎం సూచించారు.


వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే లక్ష్యం

వ్యవసాయాధికారి రామినేని రామారావు


మాట్లాడుతున్న ఏవో రామారావు

శావల్యాపురం: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తుందని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తలూరు, వేల్పూరు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రామారావు మాట్లాడుతూ రైతులు విత్తన ఎంపిక కొనుగోలు చేయు సమయంలో జాగ్రత్తలు పాటించటంతో పాటు వ్యవసాయ అధికారులు సూచనలు తూచ తప్పకుండా పాటించాలన్నారు. అలాగే ఎరువులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు సంబంధిత దుకాణాదారుడు నుంచి బిల్లు తీసుకోవాలన్నారు. అన్ని రైతుసేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో పురేటి అశోక, ఎంపీవోలు శ్రీనివాసరావు, అనుషా, రైతులు పాల్గొన్నారు.

సంస్మరణ సభ జయప్రదం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నరసరావుపేట: గత మూడు దశాబ్దాలుగా పీడత ప్రజల హక్కుల కోసం ఉద్యమించిన దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర అధ్యక్షులు ఎన్. క్రాంతికుమార్ (మెషక్) సంస్మరణ సభను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పిలుపునిస్తూ ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 17న తీవ్ర అనారోగ్యంతో క్రాంతికుమార్ మృతిచెందటం ప్రజా సంఘాలు, పీడిత ప్రజలకు తీవ్ర లోటని పేర్కొన్నారు. మంగళగిరి డోలాస్‌నగర్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు సంస్మరణ సభ కార్యక్రమాన్ని పీడీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, దీనిలో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. పీడీఎం ఏర్పాటైన తర్వాత జిల్లా కార్యదర్శిగా తన అనారోగ్యాన్ని లెక్క చేయకుండా సంఘం అభివృద్ధిలో కీలకంగా పని చేశాడని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాసంఘాల నాయకులపై ఎన్ఐఏ వేధింపులకు పాల్పడుతున్న కష్టకాలంలో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టి సంఘాన్ని ముందుకు నడిపించాడని అన్నారు. సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పన్ను చెల్లించి వడ్డీ మినహాయింపు పొందండి

నరసరావుపేట: పట్టణ పౌరులు ఈనెలాఖరులోగా ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించి వడ్డీ మినహాయింపు పొందాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంత రావు మంగళవారం పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక ఏడాదికి చెల్లించాల్సిన ఆస్తిపన్ను గడువు ఈనెలాఖరుతో ముగుస్తుందన్నారు. చెల్లించని వారు జూలై ఒకటి నుంచి పన్ను బకాయిపై రూ.100లకు రూ.2ల వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. పురపాలక అభివృద్ధికి సహకారం అందజేయాలని ప్రజలను కోరారు.

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామానికి చెందిన ఏకుల డేవిడ్ కుమార్తె అఖిల (18) కొంత కాలంగా చిలకలూరిపేట పట్టణం తూర్పుమాలపల్లిలో ఉంటూ చదువుకుంటుంది. ఇటీవల జరిగిన ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ కాగా తిరిగి సప్లిమెంటరికి అప్లయ్ చేసి రాసింది. వాటి ఫలితాల్లోనూ బాలిక ఫెయిల్ కావడంతో మనస్థాపం చెందడంతో కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో ఉదయం సుమారు 10.30 గంటలకు చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. తర్వాత ఇంటి కొచ్చి చూసిన కుటుంబ సభ్యులు బాలికను ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలిక తండ్రి డేవిడ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పంటలకు బీమా చేసుకోవాలి

నరసరావుపేట రూరల్: ప్రీమియంను చెల్లించి రైతులు పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి తెలిపారు. మండలంలోని కేసానుపల్లి, కొత్తపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శాంతి మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు వేసుకొని భూమిని సారవంతంగా చేసుకోవాలని సూచించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ జిలా మేనేజర్ లింగయ్య మాట్లాడుతూ మిరప, వరి, కంది పంటలను ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో పంటల బీమాను తీసుకోవడం జరిగిందన్నారు. మిరప, కంది పంటలను మండలం యూనిట్‌గా, వరి పంటను గ్రామం యూనిట్‌గా పరిగణిస్తారని తెలిపారు. మిరప ఎకరానికి రూ.360లు, కంది ఎకరానికి రూ.40లు, వరి ఎకరానికి రూ.80లు ప్రీమియం రైతులు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. మిరప, కంది పంటలను ఇన్సూరెన్స్ చేసుకునేందుకు జులై 31వ తేదీ, వరి ఆగస్టు 15వ తేదీ చివరి తేదీలని తెలిపారు.

మాజీ మంత్రి విడదల రజిని జన్మదిన వేడుకలు


జన్మదిన కేక్ కట్ చేస్తున్న నాయకులు

చిలకలూరిపేట: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని జన్మదిన వేడుకలు ఆమె నివాసంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను ఏర్పాటు చేసి, కట్‌చేసి ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైఎస్ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ వలెటి వెంకటేశ్వరరావు, యడ్లపాడు, నాదెండ్ల మండల పార్టీ అధ్యక్షులు వడ్డేపల్లి నర్సింహరావు (రాజు), మంగు ఏడుకొండలు, బీసీ నాయకుడు గుంజి శ్రీనివాసరావు, మైనార్టీ నాయకుడు సయ్యద్ కరిముల్లా, యువజన నాయకుడు కుప్పాల ప్రభుదాసుపాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ నాయకురాలు విడదల రజిని జన్మదిన ఫ్లెక్సీలు తొలగించి అధికార పార్టీ నాయకులు అక్కసు వెళ్లగక్కారు. మంగళవారం విడదల రజిని జన్మదినం కావడంతో సోమ వారం రాత్రి పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ వైఎస్సార్ సీపీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇది తెలుసుకున్న అధికార పార్టీ నాయకులు రాత్రికి రాత్రే పురపాలక సిబ్బందిని భారీగా పురమాయించి ఫ్లెక్సీలను తొలగింపజేశారు.

మెరుగైన వైద్యం ఇవ్వడమే వైద్యుల బాధ్యత

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి
- యడ్లపాడు పీహెచ్‌సీలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ


పున్నారావు నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో రవి

యడ్లపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించే దిశగా విధులు నిర్వర్తించడమే వైద్యుల బాధ్యత అని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. మంగళవారం యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సెంట్రల్ ల్యాబోరేటరీ భవనం నిర్మాణ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు. ఆ తరువాత కేంద్రంలో వైద్యం పొందుతున్న రోగులను కలిసి వారికి అందుతున్న ఆరోగ్య సేవలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిధిలో జరుగుతున్న కాన్పుల వివరాలు, చిన్నారులకు ఇస్తున్న వ్యాధి నిరోధక టీకాల పురోగతి, గర్భిణుల కోసం అందిస్తున్న వైద్య సేవలు ఎన్‌సీడీసీడీ సర్వే ప్రగతిపై పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భరద్వాజతో సమీక్షించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల మెరుగుదల కోసం పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్స్‌ను సక్రమంగా అమలు చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో, సర్వేలలో ప్రగతి సాధించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తమై సంక్రమించే వ్యాధుల తీవ్రతను తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సొంత మండలాల్లో బదిలీలకు అవకాశమివ్వాలి

శావల్యాపురం: గ్రామ సచివాలయ సిబ్బంది సొంత మండలాల్లో బదిలీలకు అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మండల సచివాలయ సిబ్బంది మంగళవారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ సచివాలయ సిబ్బందిని హేతుబద్ధీకరణలో భాగంగా ఏ శాఖకు బదిలీ చేస్తారో స్పష్టత ఇచ్చిన తదుపరి బదిలీలు చేయాలన్నారు. అందరు ఐక్యంగా తహసీల్దారు యం.అర్జున్‌నాయక్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్లకు వినతి పత్రాలు అందజేశారు.

గంజాయ్ మాదకద్రవ్యాలపై దృష్టి

యడ్లపాడు: గంజాయి తయారీ, నిల్వ, రవాణా, వినియోగం వంటి అక్రమ కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు యడ్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న వసంత స్పిన్నింగ్ మిల్ ప్రాంతంలో మంగళవారం డ్రోన్ సాయంతో ప్రత్యేక సర్వే నిర్వహించారు. గంజాయి హాట్‌స్పాట్‌లపై కచ్చితమైన నిఘా నిర్వహణలో భాగంగా సాంకేతిక పరమైన డ్రోన్ సర్వేను నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.